సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు..

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక్క సమస్య తలెత్తుతూనే ఉంది. మూడు రోజుల నుంచి క్యాజువాలిటీలో ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. - 8లో



గంజాయి పట్టివేత

రూ.53.28 లక్షల విలువైన 106 కిలోల 960 గ్రాముల ఎండు గంజాయి పట్టుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.5°/26.4°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ల సమావేశంలో రాహుల్‌శర్మ



భూపాలపల్లి: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవిలో తాగునీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

చెక్కు అందజేత



భూపాలపల్లి అర్బన్ : రెండేళ్ల క్రితం మోరంచపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహాలక్ష్మి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరుపున మంజూరైన చెక్కును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం అందజేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో రూ.5లక్షల చెక్కును గడ్డం శ్రీనివాస్‌కు అందజేశారు.

జార్జిరెడ్డి స్ఫూర్తి అందిపుచ్చుకోవాలి



కాటారం: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి విప్లవ స్ఫూర్తిని అందిపుచ్చుకొని యువత ఉద్యమాల్లోకి రావాలని యూవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్ అన్నారు. జార్జిరెడ్డి వర్ధంతిని కాటారం మండలకేంద్రంలో సోమవారం యూవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కల బాపు మాట్లాడుతూ దేశంలో యువత మారక ద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన జీవితాలను కోల్పోతుందని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగి యువత మత, ప్రాంతీయ పార్టీ ఉద్యమాలకు ఆకర్షితులై నిజమైన విప్లవ ప్రజా పోరాటాలను నీరుగార్చుతున్నారని పేర్కొన్నారు. జార్జిరెడ్డి చూపిన విప్లవ ఆలోచనతో భగత్‌సింగ్, చేగువేరా, అల్లూరి సీతారామరాజు, కొమురంభీం, గోపాల్‌రెడ్డి విప్లవ స్ఫూర్తితో భారత ఐక్య యువజన సమాఖ్య, యూవైఎఫ్‌ఐ యువతి యువకులను సంఘటితం చేస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంతెన రాజశేఖర్, కాల్వల సమ్మయ్య, క్లోం రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

రామప్పలో మెక్సికో దేశస్తుడు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని మెక్సికోకు చెందిన ప్రొఫెసర్ డేనియల్ సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరుడిని ఆయన దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్‌లు తాడబోయిన వెంకటేశ్, సాయినాథ్ వివరించగా రామప్ప టెంపుల్ బాగుందని కొనియాడారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు



వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరుతో సోమవారం వాల్ పోస్టర్లు వెలిశాయి. మండల పరిధిలోని కొప్పునూరు కాలనీ, ఘణపురం గ్రామాల మధ్యన ఉన్న వంతెనకు అంటించారు. 'మమ్మల్ని బతక నివ్వండి, నిత్యం ఆదివాసీ ప్రజలపై ఆధారపడి బతికే మీరు అడవుల్లో విచ్చల విడిగా బాంబులు పెట్టడం సరికాదు.. ఇదేనా మీ సిద్ధాంతం' అంటూ ఆదివాసీ యువజన సంఘం పేరుతో పలు రకాల హెచ్చరికలతో వాల్ పోస్టర్లలో రాసి ఉంది.

ఆదమరిస్తే.. అగ్గిపాలే!





వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

- నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర నష్టం
- జిల్లాలో అగ్నిప్రమాద వారోత్సవాలు ఆరంభం
- 14నుంచి 20వరకు అవగాహన సదస్సులు

భూపాలపల్లి అర్బన్: సూరీడు నేలకొచ్చినట్టు ఎండలు మంట రేపుతున్నాయి. జనానికి సెగలు పుట్టిస్తున్నాయి. సామాన్య ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఈ సమయంలోనే చిన్నపాటి అజాగ్రత్తతో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంది. తద్వారా సర్వం బుగ్గి అవుతోంది. తీవ్ర నష్టాన్ని మిగుల్చుతోంది. ఎండా కాలం, మండించే కాలం కాబట్టి అప్రమత్తత అవసరమని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఒకే ఒక్క అగ్నిమాపక కేంద్రం భూపాలపల్లిలో ఉంది.

గతేడాది రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల మేర నష్టం

జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 41 అగ్నిప్రమాదాలు జరగగా వాటిల్లో సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4కోట్ల మేర నష్టం జరిగింది. అగ్నిప్రమాదాల్లో రూ.5 కోట్ల ఆస్తిని సిబ్బంది సకాలంలో స్పందించి కాపాడారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏ చిన్నపాటి ప్రమాదం వాటిల్లినా తీవ్రంగా నష్టపోవాల్సి రావడంతో అగ్నిప్రమాదాలను అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖాధికారులు విశేష కృషి చేస్తున్నారు.

సమయస్ఫూర్తి అవసరం

ప్రస్తుతం ఎండలు అధికమయ్యాయి. ఈ సమయంలో అగ్నిప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జిల్లాలో అధికశాతం తీరప్రాంత గ్రామాలు, మారుమూల ప్రాంతాలు కావడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా అంతా బుగ్గి అవుతుంది. గతంలో తీర ప్రాంత గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరిగి భారీ నష్టం జరిగింది. ప్రమాదాలు జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాన్ని నివారించవచ్చు.

అవగాహన కార్యక్రమాలు

- అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
- ఈనెల 14న జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాలను సందర్శించి సిబ్బంది కుటుంబ సభ్యులతో సమీక్షలు నిర్వహించారు.
- 15న ప్రధాన కూడలి ప్రాంతాలైన బస్‌స్టేషన్, షాపింగ్ ఏరియాలు, మార్కెట్, సినిమా థియేటర్ అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు.
- 16న హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీపై అవగాహన సదస్సులు
- 17న అపార్ట్‌మెంట్లు, గ్యాస్ కంపెనీలు, విద్యుత్ శాఖ కార్యాలయాలు సందర్శించి ఫైర్ సేఫ్టీ పరికరాల పనితీరును పరిశీలించి వారికి అవగాహన కల్పిస్తారు.
- 18న పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్స్ నిర్వాహకులకు..
- 19న దుకాణ సముదాయాలు, ఫంక్షన్‌హాళ్లు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లలో అవగాహన నిర్వహిస్తారు.
- 20న అగ్నిప్రమాదాలపై సమావేశం నిర్వహించి ప్రమాదాలు సంభవిస్తే ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుతులు అందజేయనున్నారు.

అగ్నిమాపకశాఖ సూచనలు

- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలను ఆర్పివేసిన తర్వాత పారేయాలి. చెత్త, గడ్డి, ఎండిన చెట్లు, పూరిపాకల వద్ద వీటిని వేయరాదు.
- ఎక్కువ రోజులు ఇంట్లో లేని సమయంలో విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలి.
- వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- గృహాలకు గడ్డి వాములు 60 అడుగుల దూరంలో వేసుకోవాలి.
- పూరింట్లో నివసించే వారు వంట పూర్తయిన వెంటనే పొయ్యిలో నిప్పును ఆర్పేయాలి.
- వేసవిలో ఉదయం 8గంటల లోపు, సాయంత్రం 6గంటల తరువాత కట్టెల పొయ్యిలను ఉపయోగించాలి.
- గ్యాస్ సిలెండరుకు దగ్గరలో పెట్రోలు, డీజిల్, కిరోసిన్ వంటి మండే వస్తువులను ఉంచరాదు.
- వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపివేయాలి.
- అపార్ట్‌మెంట్లు, కర్మాగారాల గోదాములు, గిడ్డంగులలో అగ్నిమాపక శాఖ సూచనలు విధిగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

సమాచారమిస్తే తక్షణమే స్పందిస్తాం..



అగ్ని ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తాం. అగ్నిమాపక శకటం వచ్చేలోగా నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలి. తద్వారా నష్టం కాస్త తగ్గుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే 101, భూపాలపల్లి ఫైర్ స్టేషన్ 87126 99209 నంబర్లకు సమాచారం అందించాలి.

- సతీష్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134 జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని పంచశీల పతాకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ. అంబేడ్కర్ కారణంగానే అన్ని కులాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. వచ్చే అంబేడ్కర్ జయంతి నాటికి అంబేడ్కర్, జ్యోతిరావుపూలే కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునిత, దళిత సంఘాల నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం


కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని.. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అకాల వర్షం.. పంట నష్టం

ఈ ఫొటోలో ఉన్న రైతు దంపతులు కొండ గొర్ల చిన్న దుర్గయ్య, దుర్గ. ఇద్దరు కలిసి రామన్నగూడెం శివారులో 5ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. పంట కోతదశకు చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారం కురిసిన వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయింది. పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని కన్నీటి పర్యంతం అవుతున్నారు.



పంటను చూసి కంటతడి పెడుతున్న కొండగొర్ల చిన్న దుర్గయ్య దంపతులు



వర్షంతో దెబ్బతిన్న వరిపైరు

- వందలాది ఎకరాల్లో నేలవాలిన వరిపైరు
- కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటకు దెబ్బ
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ఏటూరునాగారం: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పొట్ట దశలో ఉన్న వరి ధాన్యం రాలిపోగా పంటంతా నేలవాలింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి పోయింది. ఏటూరునాగారం మండల పరిధిలోని రామన్నగూడెం, రొయ్యూర్, శంకరాజుపల్లి, ముళ్లకట్ట, చెల్పాక, చిన్నబోయినపల్లి, గోగులపల్లి, శివాపురం ప్రాంతాల్లో వరిపంట నేలవాలడంతో పాటు ధాన్యం నేలరాలింది. పంట చేతికొచ్చే తరుణంలోనే మాయదారి వర్షం నట్టేట ముంచిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఇదిలా ఉండగా మిర్చి కాయలను కోతకోసి కల్లాల వద్ద ఆరబెట్టగా తడిసిపోయింది. దీంతో మిరపకాయలు మచ్చలు రావడం, తొడిమె ఊడిపోవడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ ఉండబోదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడితోటల్లోని కాయలు సైతం గాలివానకు రాలిపోయాయి. పంటల పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మండల పరిధిలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి సుమారువెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నేటినుంచి సర్వే మొదలవుతుందని ఏఓ వేణుగోపాల్ తెలిపారు. రైతులు అధైర్య పడకుండా పంటను కాపాడుకునే సూచనలను వివరించినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంటలను పరిశీలించి నష్టాన్ని సర్వేచేసి నివేదిక అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



వరి పంట సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి. అకాల వర్షం రైతులను కోలుకోలేకుండా దెబ్బతీసింది. వందలాది ఎకరాల్లోని వరిపంట నేలబారింది. పొట్టదశలో ఉన్న వరిపంట వర్షం దాటికి కంకులు రాలి నీటిలో మునిగి పోయాయి. పంటను కోసే పరిస్థితి లేకుండా పోయింది. వరిపొలాలను చూస్తే దుఃఖం ఆగడం లేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

- సునారికాని శ్రీనివాస్, రైతు, ఏటూరునాగారం

ప్రహరీ.. పనులేవి?

కేయూలో ముందుకు సాగని కాంపౌండ్ వాల్ నిర్మాణం

- ఆక్రమణల అడ్డుకట్టకు గోడనే మార్గమని నిర్ణయం
- పనులు మొదలుపెట్టి ఆపేసిన కాంట్రాక్టర్
- మళ్లీ రూ.20కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్
- గత 'కాంట్రాక్ట్'ను క్యాన్సిల్ చేసే యోచన?
- ఇంకా తేలని యూనివర్సిటీ భూమి.. బయటికి రాని నివేదిక



కేయూ భూమిలో హద్దులు నిర్ణయించి మార్కింగ్ ఇస్తున్న సంబంధిత అధికారులు సిబ్బంది (ఫైల్)



కెనాల్ ఏరియాలో ఇటీవల సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణకు అడ్డుకట్ట వేసేందుకు చేపట్టిన ప్రహరీ నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇప్పటికే పలుమార్లు సర్వే చేసి యూనివర్సిటీ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. వీటిపై ఎటువంటి చర్యలూ లేకపోగా, సరిహద్దులు గుర్తించి భవిష్యత్‌లో ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించాలనుకున్నారు. మొదట వేసిన ఎస్టిమేషన్ ప్రకారం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వివిధ కారణాలతో పనులు చేపట్టలేదు. దీంతో మరోసారి రివైజ్డ్ ఎస్టిమేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భావంలోనే 672 ఎకరాలకు అప్పట్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి భూమిని సేకరించారు. భూమి ఆక్రమణకు గురవుతుందన్న సమాచారంతో కొంత కాలం క్రితం కేయూ పాలక మండలి సభ్యుడిగా కొనసాగిన డాక్టర్ నాగేంద్ర బాబు పలు రికార్డులను సేకరించారు. చివరి నివేదికలో 666 ఎకరాలు ఉందని ఇచ్చారు. కానీ ఇప్పటికి ఆ నివేదికను బయటికి వెల్లడించలేదు. అదే విధంగా 2022లో జిల్లాభూమి కొలతల అధికారులు డిజిటల్ గ్లోబల్ ఫిజికల్ పొజిషన్ సర్వే ద్వారా 622 ఎకరాలు ఉన్నట్లు నివేదిక ఇచ్చారు.

విజిలెన్స్ అధికారుల సమక్షంలో మళ్లీ సర్వే, హద్దుల నిర్ణయం

విజిలెన్స్ అధికారుల సమక్షంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, కేయూ అభివృద్ధి అధికారుల సిబ్బంది బృందం కలిసి గత ఏడాది సెప్టెంబర్‌నుంచి ప్రారంభమైన సర్వే పలు అడ్డంకులతో ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగింది. గత నెలలో ఎస్సారెస్పీ కాల్వ ప్రాంతంలోనూ యూనివర్సిటీ భూముల హద్దులు నిర్ణయించారు. రెవెన్యూ సర్వేయర్‌ల ద్వారా సర్వే చేయిస్తూ హద్దులను నిర్ణయిస్తూ మార్కింగ్ కూడా చేశారు. పలు చోట్ల ఆక్రమణలు జరిగినట్లుగా వెలుగు చూశాయి. ఈ సర్వే పూర్తయి నెలరోజులు గడిచినట్లు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ నివేదిక యూనివర్సిటీ అధికారులకు అందాల్సింది. అప్పుడే ఎన్ని ఎకరాలున్నది అనేది స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుందని యూనివర్సిటీ అధికారులు అంటున్నారు.

పలుచోట్ల ఆక్రమణలు..

కాకతీయ యూనివర్సిటీలో 229 సర్వేనంబర్‌లో 8మంది ఇళ్లు, మరో ముగ్గురి ప్లాట్లు ఉన్నాయనేది ఇటీవల విజిలెన్స్ అధికారుల సమక్షంలో నిర్వహించిన సర్వేలో గుర్తించి హద్దులు నిర్ణయించారు. ఎకరం పది గుంటలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అదేవిధంగా పలివేల్పుల వైపు కూడా ఆక్రమణలున్నట్లు గుర్తించారు. డబ్బాలవైపు సర్వే నంబర్ 60, 214లో కలిపి 600 గజాలు, 413 సర్వే నంబర్‌లో ఎకరం 5గుంటల భూమి తనదేనని ఓ ప్రైవేటు వ్యక్తి, యూనివర్సిటీదేనని అధికారులు వాదిస్తుండగా ఈ కేసు కోర్టులో ఉంది.

ప్రహరీ నిర్మాణం మొదలెప్పుడో..?

ప్రహరీ లేకపోవడంతోనే ఆక్రమణలు జరుగుతున్నట్లు భావించిన అధికారులు రూ.10కోట్లు వెచ్చించి నిర్మించేందుకు ఓ సంస్థకు అప్పగించారు. టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పూర్తిస్థాయిలో గాకుండా కొంతభాగానికి టెండర్ పిలిచినట్లు సమాచారం. సదరు కాంట్రాక్టర్ ఒకటి, రెండుచోట్ల చెట్లను కొట్టి చదును చేశారు. ఆ తరువాత వివిధ కారణాలతో పనులు ఆపేశారు. ఈ క్రమంలో గోడ నిర్మాణానికి మళ్లీ కేయూ బిల్డింగ్ డివిజన్ రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసింది. రూ.20కోట్ల వ్యయంతో 10.5 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించి పాలకమండలి దృష్టికి తీసుకెళ్లింది. ఈ విషయం ప్రస్తుతం పాలకమండలి వద్ద ఉంది.

నివేదిక వచ్చాక ప్రహరీ నిర్మాణం



కాకతీయ యూనివర్సిటీ భూములకు సంబంధించి గత కొన్ని నెలల క్రితం విజిలెన్స్ అధికారుల సమక్షంలో రెవెన్యూ సర్వేయర్లతో సర్వే జరిగింది. అన్నిచోట్ల హద్దులను నిర్ణయించి మార్కింగ్ చేశారు. యూనివర్సిటీ భూమిపై నివేదిక రావాల్సి ఉంది. వారంరోజుల్లో వస్తుందని భావిస్తున్నాం. నివేదిక వచ్చాక గతంలో నిర్ణయించినట్లు కాకుండా ఇటీవల వేసిన రివైజ్డ్ ఎస్టిమేషన్ రూ.20కోట్లతో చుట్టూరా హద్దుల ప్రకారం గోడ నిర్మిస్తాం. గతంలో ఇచ్చిన కాంట్రాక్టును సైతం క్యాన్సిల్ చేయించాల్సింది. మళ్లీ మరో సంస్థకు అప్పగించాలనే ఆలోచన చేస్తున్నాం.

- ఎన్.వాసుదేవరెడ్డి, కేయూ అభివృద్ధి అధికారి

యువత మత్తుకు బానిస కావొద్దు

- ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: డ్రగ్స్‌ని తరిమికొడదామని.. యువత మత్తుకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సూచించారు. మండల పరిధిలోని రామన్నగూడెంలో ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణ పొందిన నార్కోటిక్ స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందాలు గ్రామంలో సోమవారం తనిఖీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలుగా మారితే విలువైన జీవితాలు ఆగం అవుతాయని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలోకి అపరిచితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడుమార్గంలో పయనించకుండా మంచి మార్గంవైపు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



యువతకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ

'బిల్ట్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి'

ఏటూరునాగారం: మంగపేట మండల పరిధిలోని కమలాపురంలో గల మూతపడిన బిల్ట్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాధావత్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పొద్దునూరు యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట మానవహక్కుల వేదిక నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. 2014లో మూతపడిన బిల్ట్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఐటీడీఏ నుంచి కమలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కార్మికులతో పాదయాత్రను నిర్వహించారు. 1977 లో ఏపీ రేయాన్స్‌గా మొదలైన ఫ్యాక్టరీ బిల్ట్‌గా రూపాంతరం చెంది అనేక లాభాలను గడించిందని తెలిపారు. అనంతరం నష్టాలు వస్తున్నాయనే సాకుతో 2014లో బిల్ట్‌ను మూసివేశారని తెలిపారు. దీంతో దాదాపు 2వేల మంది రోడ్డున పడ్డారని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమాన్ ప్రసాద్, పద్మజ, పాలకుర్తి శ్రీనివాస్, లవ కుమార్, సమ్మయ్య, యుగేందర్, శంకర్, కరీంనగర్ జిల్లా బాధ్యులు మధు, అచ్యుత్, సదానందం, ఖమ్మం జిల్లా బాధ్యులు ఆదినారాయణ, బిల్ట్ కార్మికులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మానవహక్కుల వేదిక నాయకులు

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు..

- వివాహిత నవ్య బలవన్మరణంపై కేసు నమోదు


నవ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన నవ్య మృతిపై ఆమె తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సోమవారం రాత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన శ్రీపాద ఉత్తరాచారి పెద్ద కుమార్తె నవ్య (21)ను ఇల్లందు మండలం ధర్మారం తండాకు చెందిన తాడూరి భిక్షమాచారి, సత్యవతి దంపతుల కుమారుడు రవిచంద్రాచారికి ఇచ్చి గతేడాది డిసెంబర్ 26వ తేదీన వివాహం జరిపించారు. వివాహం సమయంలో రూ.50 వేలు కట్నం ఇచ్చారు. భర్త రవిచంద్రాచారి, అత్తామామ భిక్షమాచారి, సత్యవతి తరచూ అదనపు కట్నం కోసం నవ్యను వేధింపులకు గురిచేస్తుండేవారు. ఈ క్రమంలో పలుమార్లు పంచాయితీలు జరగగా అదనపు కట్నం డబ్బులు తర్వాత ఇస్తామని ఆపుకుంటూ వచ్చారు. ఆదివారం సాయంత్రం నవ్య తాను ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడుతున్నానని పక్కింటి వారికి చెప్పగా వారు హుటాహుటిన వచ్చి భర్త రవిచంద్రాచారికి చెప్పారు. అప్పటికే ఆమె ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఉత్తరాచారి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారని సీఐ తెలిపారు.

మండలంలో రెండు చోట్ల చోరీలు


బీరువాను పగులకొట్టిన దొంగలు

వెంకటాపురం(కె): మండలంలోని ఉప్పేడు గొల్లగూడెం, మండ కేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం చోరీలు జరిగాయి. బాధితుల కథనం ప్రకారం.. ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన నాగేశ్వరావు రాత్రి నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంటి ఎదుట ఉన్న షెట్టర్ పగుల కొట్టి అందులో ఉన్న రూ. 50 వేల నగదు, ఓ సెల్‌ఫోన్ అపహరించారు. అలాగే, మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు సంకా హేమ సుందర్ ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగుల కొట్టి అందులో ఉన్న కిలో వెండి, 18 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.



AGAPE GOOD SHEPHERD HIGH SCHOOL
Sanjay Nagar, Jangaon
WANTED TEACHERS
• Pre-Primary : Montessori Teachers for Nursery, LKG, UKG (Female)
• Primary : English & Science
• High School : Maths & English
• IIT : Maths, Physics, Chemistry • PET : Male & Female
• Non Teaching : Drivers, Cooks, Aya's, Watchmens, Clerks, Computer operators Wardens - (Male & Female, Christian Background)
PRESTON JUNIOR COLLEGE
Bus Stand Road, Jangaon
WANTED LECTURERS
General & Vocational : All Subjects
WALK-IN-INTERVIEWS : Time : 10:00 am to 4:00 pm
Dayanilayam Hostel, Hanumakonda Road, Sanjay Nagar, Jangaon
8885836606, 8523825225, 7702594588, 9848760236

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME
■ THIRUPATHI MUSTYLA S/O LATE RAJAIAH, RANK NAIK, ARMY NO 14637410 F, D.NO.1-7-610/A,BASITH NAGAR,7TH CROSS, TEMPLE LANE, SUBEDARI, HANAMKONDA, WARANGAL (VI,PO,DIST) TELANGANA 506001. MY ARMY RECORD WIFE NAME MENTION AS M.ARUNA. INSTEAD OF MUSTYALA ARUNA. VIDE AFFIDAVIT DATED 12/04/ 2025. BEFORE THE NOTARY PUBLIC (GOVT OF A.P) [C-820336]

WANTED
■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002759]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED TEACHERS
■ Montessori High School, Mahabubabad Requires Primary to High School Teachers for all subjects. Must be Fluent in English. Interview 19/04/25 9.30am to 1pm. 9440325643. [W-1264147]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎంజీఎంలో ఎక్స్‌రే కష్టాలు..

ఆస్పత్రిలో నిలిచిన ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు

- మూడు రోజులుగా ఆ గదికి తాళం
- గాయాలతో క్షతగాత్రుల నరకయాతన, ఆర్తనాదాలు
- పట్టించుకోని ఆస్పత్రి ఉన్నతాధికారులు


తాళం వేసి ఉన్న ఎమర్జెన్సీ ఎక్స్‌రే గది


ఎక్స్‌రే సేవల కోసం స్ట్రెచర్‌పై వచ్చిన క్షతగాత్రుడు (ఫైల్)

ఎంజీఎం : ఉత్తర తెలంగాణ పేద రోగుల పెద్దదిక్కు ఎంజీఎం ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక్క సమస్య తలెత్తుతూనే ఉంది. ఒక రోజు మందులు ఉండవు.. మరో రోజు వైద్యులు రారు. అన్ని బాగున్నాయి.. అనుకున్న క్షణమే పరికరాల్లో సాంకేతిక లోపమంటూ సేవలు అందవు.. ఇలా ఆస్పత్రిలో ఏ విభాగంలో చూసినా ఏదో సమస్య కనిపిస్తూనే ఉంటుంది. ఫలితంగా ఎంజీఎంకు వస్తే పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందుతాయా అనే నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఈక్రమంలో మూడు రోజుల నుంచి ఆస్పత్రిలో అత్యంత కీలక విభాగమైనా క్యాజువాలిటీలో ఎమర్జెన్సీ ఎక్స్‌రే సేవలు నిలిచాయి. ఈ సేవలను వెంటనే పునరుద్ధరణ చేయాల్సిన అవసరమన్నా రోజులు తరబడిగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్షతగాత్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒక పక్క ప్రమాదంలో విరిగిన కాళ్లు, చేతులతో ఆస్పత్రిలోని క్యాజువాలిటీ విభాగానికి వస్తే చికిత్స కోసం ఎక్స్‌రే పనిచేయకపోవడంతో ఇక్కడి నుంచి నుంచి ఓపీ బ్లాక్‌లో ఉన్న ఎక్స్‌రే గదికి క్షతగాత్రులను తరలించే సమయంలో వినబడుతున్న ఆర్తనాదాలు అందరినీ కంటతడిపెట్టిస్తున్నాయి.

చికిత్స కోసం తిప్పలు పడాల్సిందే..

ఎమర్జెన్సీ ఎక్స్‌రే పరికరం పనిచేయకపోవడంతో ఈ సేవల కోసం క్షతగాత్రుల బంధువులు తిప్పలు పడాల్సి వస్తోంది. క్షతగాత్రుడిని క్యాజువాలిటీ నుంచి ఓపీ బ్లాక్‌లోని 92 గదికి తరలించేందుకు వీల్ చైర్స్, స్ట్రెచర్స్ దొరకబట్టడానికి కుస్తీ పట్టాల్సిందే. ఆస్పత్రిలోని 92 గది ఎక్కడ అని తెలుసుకునేందుకు మరో ప్రయత్నం చేయాలి. చివరకు అక్కడికి వెళ్లాక ఒకే ఒక్క ఎక్స్‌రే పరికరం పనిచేస్తుండడంతో సేవల కోసం ఎదురుచూడాలి.. ఆ సమయంలో క్షతగాత్రుల రోదనలు చూడలేక సిబ్బందితో వాగ్వాదానికి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఎంజీఎంలో అత్యవసర సేవల కోసం వచ్చిన క్షతగాత్రుల బాధలు నిత్యం పెరిగిపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతున్నారు. ఉన్న ఒకే ఒక్క ఆర్ఎంఓ అన్ని పనులు చక్కబెట్టలేక చేతులేత్తేస్తున్న దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా మంత్రులు స్పందించి ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించాలని రోగులు వేడుకుంటున్నారు.

> **మరమ్మతులు చేస్తాం..**
> ఎమర్జెన్సీ పరికరంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఎక్స్‌రే సేవలను 92 గదిలోని డిజిటల్ ఎక్స్‌రే ద్వారా అందిస్తున్నాం. ఎమర్జెన్సీ విభాగంలో ఎక్స్‌రే పరికరానికి మరమ్మతులు చేపడుతాం.
> -కిశోర్, సూపరింటెండెంట్

కూలీకి వస్తూ కానరానిలోకాలకు..

- హార్వెస్టర్ కింద పడి మహిళా కూలీ మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు
- బూర్నపల్లి శివారులో ఘటన


కనుకమ్మ (ఫైల్)

టేకుమట్ల: కూలీకి వస్తూ ఓ మహిళ కానరానిలోకాలకు వెళ్లింది. హార్వెస్టర్ వెనక్కి వస్తుండగా దాని కింద పడి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బూర్నపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు వరి పంటలో బెరుకుల తీసేందుకు ఆటోలో బూర్నపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆటో ముందు హార్వెస్టర్ వెళ్తుండగా.. ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తోంది. దీంతో హార్వెస్టర్ ఆపరేటర్ బస్సుకు దారి ఇచ్చేందుకు వెనక్కి తీస్తున్నాడు. ఈ క్రమంలో హార్వెస్టర్ వెనుక ఉన్న ఆటోను డ్రైవర్ కూడా వెనక్కి తీస్తుండగా అందులో ఉన్న ఇద్దరు మహిళలు భయంతో కిందికి దిగారు. అయితే హార్వెస్టర్ వారిపైకి ఎక్కింది. ఈ ఘటనలో దాసరి కనుకమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందగా, మరో కూలీ వసంతకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వసంతను చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై దాసరి సుదాకర్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. అనంతరం కనుకమ్మ మృతదేహాన్ని చిట్యాల ఆస్పత్రి మార్చురీకి తరలిచారు.

కన్నీరుమున్నీరైన కూలీలు..

క్షణం ముందు ప్రాణంతో అందరి మధ్య ప్రయాణించిన కనుకమ్మ రెప్పపాటు క్షణంలో విగతజీవిగా మారడంతోపాటు మరో మహిళ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా చలించిన తోటి కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. సాయంత్రం కూలీకి రాకున్నా బతికేదేమో అని విలపించారు.

ప్రాణాలు తీస్తున్న సాయంత్రం కూలీ..

వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో వ్యవసాయ కూలీలు ఉదయం, సాయంత్రం రెండు పూటల పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మహిళా కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వెళ్లగా లారీ అదుపు తప్పి మీదపడిన ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే మొట్లపల్లి నుంచి కూలీలు సాయంత్రం వేళ పొలంలోని బెరుకులు తీసేందుకు వస్తుండగా హార్వెస్టర్ మృత్యుశకటమై కనుకమ్మను కబలించింది.

> **బావిలోపడి వ్యక్తి..**
>
> 
> రాజయ్య (ఫైల్)
>
> నెక్కొండ: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని వెంకటాపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాళ్లబండి పెద్ద రాజయ్య (56) ఈనెల 13న సాయంత్రం తన పొలం వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారిలో గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరారావు వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. కుటుంబీకులు రాజయ్య కోసం వెతకగా సోమవారం సాయంత్రం బావిలో శవమై తేలి కనిపించాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నామని ఎస్సై తెలిపారు.

మోటార్లతో నీటిని తోడేశారు


మోటారు ద్వారా నీటిని తోడేస్తున్న రైతు కుటుంబం


ధాన్యం పక్కన నిలిచిన నీటిని తొలగించేందుకు కష్టపడుతున్న రైతు రజిత కుటుంబం

- జనగామ మార్కెట్ ఐకేపీ సెంటర్‌లో రైతుల గోస

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌లో ఏ రైతును కదిలించిన కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షంతో 20వేల బస్తాలకు పైగా ధాన్యం తడిసి పోగా, వరద వెళ్లే దారిలేక ధాన్యం రాశుల పక్కనే నిలిచి ముంచేసింది. నీటిలో మునిగిన ధాన్యాన్ని బయటకు తీసేందుకు రైతులు మోటార్లు పెట్టి తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనగామ మండలం చౌడారం గ్రామానికి చెందిన రైతు దండబోయిన రజిత కుటుంబం ఐదు ఎకరాలు సాగు చేయగా, 200 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేందుకు మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు నాలుగు రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చారు. తేమ పేరుతో కొనుగోలు ఆలస్యం కావడంతో అకాల వర్షం 200 బస్తాలను ముంచేసింది. 20 బస్తాలు వరదలో కొట్టుకుపోయాయి. రాత్రి 7.30 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటలకు వరకు 180 బస్తాల ధాన్యం నీటిలోనే ఉండిపోయింది. దీంతో రైతులు ఇంట్లో వినియోగించే నీటి మోటారును తీసుకొచ్చి కుటుంబమంతా నాలుగు గంటల పాటు కష్టపడి తోడేశారు. ఒక్క అధికారి వచ్చి పలకరించలేదని, టార్పాలిన్ కవర్లు సైతం ఇవ్వలేదని మహిళా రైతు రజిత.. కన్నీరుమున్నీరుగా విలపించారు. 12 గంటలపాటు తడిసిన ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని ఆందోళనే వ్యక్తం చేస్తున్నారు.

హాల్ మార్కింగ్ లైసెన్సు రద్దుతో ఇబ్బందులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 18 హాల్ మార్కింగ్ సెంటర్ల లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేయడంతో వినియోగదారులు మోసపోయే అవకాశాలున్నాయని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం వరంగల్ సీతారామ కాంప్లెక్స్‌లో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ బంగారు ఆభరణాల నాణ్యతకు ఉద్దేశించిన హాల్ మార్కింగ్ విధానం అమలు కాకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో న్యాయ సలహాదారు సీనియర్ అడ్వకేట్ రాయబారపు భిక్షపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, మిగతా అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెళ్లి బాధ.. చితికి చేర్చింది..

- సంబంధం కుదరడం లేదని యువకుడి బలవన్మరణం


వేణు(ఫైల్)

దుగ్గొండి: ఉన్నత విద్యనభ్యసించాడు. ఎంతకూ పెద్ద ఉద్యోగం రాలేదు. చివరికి ఓ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాడు. వచ్చే వేతనం ఖర్చులకూ సరిపోవడం లేదు. మంచి ఉద్యోగం లేదని వచ్చిన పెళ్లి సంబంధాలు రద్దువుతున్నాయి. దీంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంగోళి రాజేశ్వర్‌రావు, పద్మ దంపతుల కుమారుడు వేణు(30) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు సాగించి చివరికి తక్కువ వేతనానికి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అయితే వేతనం ఖర్చులకు సరిపోకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఈ విషయం తండ్రికి చెప్పడంతో వ్యవసాయం చేసుకుందామని చెప్పి ఓదార్చాడు. వ్యవసాయ పనులు చేయలేక పోయాడు. ఏ పనిచేయలేక తల్లిదండ్రులకు భారంగా మారానని మదనపడుతున్నాడు. ఇదే తరుణంలో వేణుకు అనేక పెళ్లి సంబంధాలు చూశారు. వేణు ఉద్యోగ వివరాలు తెలుసుకున్నాక పెళ్లి కూతురు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. ఇలా మూడు సంబంధాలు రద్దు అయ్యాయి. ఇక తనకు పెళ్లికాదని మనస్తాపంతో తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన మృతుడి అమ్మమ్మ లచ్చమ్మ దారి వెంట వెళ్తున్న వారిని పిలిచి విషయం చెప్పి తలుపులు తీయించింది. అప్పటికే వేణు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దించి చూడగా మృతిచెంది ఉన్నాడు. చేతికందొచ్చిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడడంతో రాజేశ్వర్‌రావు, పద్మ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

కులనిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: సమాజంలో అంటరానితనం, కుల నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని స్పోర్ట్స్ క్లబ్‌లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని సీఎండీ ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన, డైరెక్టర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాజ్యాంగం మనుగడలో ఉన్నంతకాలం అంబేడ్కర్ పేరు చిర స్థాయిలో నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం, కార్యదర్శి ఎన్.కుమారస్వామి, ఫైనాన్స్ సెక్రటరీ నర్సింహారావు, టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, సీజీఆర్‌ఎఫ్ నిజామాబాద్ చైర్మన్ ఇ.నారాయణ, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డి.ఈలు విజేందర్ రెడ్డి, సామ్యనాయక్, జి.సాంబరెడ్డి, ఎస్.మల్లికార్జున్, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన అంబేడ్కర్

- మంత్రి కొండా సురేఖ
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు


శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్: దేశ ఔన్నత్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతూ.. రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత రూప శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ సామిశెట్టి ప్రవీణ్‌తో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకం అన్నారు. పౌరుడి నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చాటిన మహామేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ ఫౌండేషన్ దాత మెరుగు అశోక్, విగ్రహ దాత రేణుకుంట్ల రవీందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాలేపాక నరేందర్, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల శివ, నాయకులు దిడ్డి కుమారస్వామి, మీసాల ప్రకాశ్, కొత్తపెల్లి శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, గడ్డం రవి, శ్రీరాం రాజేశ్, పగడాల సతీశ్ పాల్గొన్నారు.

సమసమాజ స్వాప్నికుడు..

వరంగల్: సమసమాజ స్వాప్నికుడు బీఆర్ అంబేడ్కర్ అని మంత్రి కొండా సురేఖ అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ కాశిబుగ్గ జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి కొండా సురేఖ, బల్దియా మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడతూ.. అంబేడ్కర్ ఆలోచనలు, ఉద్యమాలు ఇప్పటికీ మార్గదర్శకమేనన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కాశిబుగ్గ జంక్షన్ అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు చనిపో..

ఆస్తి కోసం తండ్రికి కొడుకు, కోడలు మానసిక వేధింపులు

- మనస్తాపంతో గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య
- కడారిగూడెం గ్రామంలో ఘటన
- పోలీసులకు మృతుడి కూతురు ఫిర్యాదు.. కేసు నమోదు


మల్లేశం(ఫైల్)

వర్ధన్నపేట : ప్రస్తుత సమాజంలో రక్తసంబంధాలు మంటగలుస్తున్నాయని చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ. ఆస్తి కోసం కన్న తండ్రి అని చూడకుండా కుమారుడు, కోడలు నిత్యం వేధింపులకు గురిచేసి అతడు బలవన్మరణానికి పాల్పడేలా కారణమయ్యారు. పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తుండగా దీనికి ఆ వృద్ధుడు ససేమిరా అంటున్నాడు. దీంతో మానసికంగా హింసిస్తున్నారు. నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు మందు తాగి చనిపో అని కోడలు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఆ వృద్ధుడు గడ్డిమందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కడారిగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశం(93)కు నలుగురు సంతానం. చిన్న కుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్ర.. గత కొద్ది రోజులుగా ఆస్తి కోసం నిత్యం వేధిస్తున్నారు. మల్లేశం పేర ఉన్న పొలం, ఇంటి స్థలాలు, ఇల్లు తమపేర చేయాలని మానసిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఎలేంద్ర 'నువ్వు ఉండి ఏం ప్రయోజనం లేదు.. మందు తాగి చనిపో' అని మామ మల్లేశంను వేధించింది. దీంతో మల్లేశం ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన రెండో కుమారుడు చంద్రమౌళి వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆదివారం రాత్రి 8.20 గంటలకు మల్లేశం చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కూతురు అమరావతి విజయ ఫిర్యాదు మేరకు చిన్నకుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ సోమవారం తెలిపారు.

ఎలుగుబంటి కళేబరం లభ్యం

- విద్యుత్ తీగల ఉచ్చుకు బలి?

కాటారం: మహాముత్తారం మండలం యత్నారం అటవీ ప్రాంతంలోని కొండెంగులవాగు సమీపంలో సోమవారం ఎలుగుబంటి కళేబరం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. యత్నారం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పలువురు ఎలుగుబంటి కళేబరం చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. మూడు, నాలుగు రోజుల క్రితం ఎలుగుబంటి మృతి చెందినట్లు గుర్తించారు. కళేబరం సమీపంలో విద్యుత్ తీగలు ఉండటంతో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు బలై ఉంటుందని భావిస్తున్నారు. ఎలుగుబంటి మాంసం, గోర్లను వేటగాళ్లు తీసుకుని కేవలం కళేబరాన్ని మాత్రమే వదిలి వేశారు. దీంతో వేటగాళ్ల విద్యుత్ తీగలకే ఎలుగుబంటి బలైందని స్పష్టమవుతోంది. ఎలుగుబంటి కళేబరాన్ని ఫారెస్ట్ కాళేశ్వరం జోనల్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఎఫ్ జోగేందర్, ఇతర అధికారులు పరిశీలించారు. ఎలుగుబంటి మృతిపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, మహాముత్తారం అటవీ ప్రాంతంలో యత్నారం, సింగారం గ్రామాల మధ్యలో విద్యుత్ లైన్‌కు ఉచ్చులు బిగించి వన్యప్రాణుల వేట జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారుల కనుసన్నల్లోనే ఇక్కడ తతంగం జరుగుతుందని, పలువురు సిబ్బంది పాత్రులుగా ఉన్నారని చర్చ జరుగుతోంది.

రూ.53.28 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మానుకోట డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

కురవి: రూ.53.28 లక్షల విలువైన 106 కిలోల 960 గ్రాముల ఎండు గంజాయి పట్టుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కురవి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్ ఎదుట ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఎస్సై గంద్రాతి సతీశ్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన ఓ కారు కనిపించడంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో మరిపెడ మండలం తండా ధర్మారంకు చెందిన బానోత్ మహేందర్, ఒడిశాకు చెందిన నర్సింగ్ మడి, రామచంద్ర మడి, మాడ్కమి చంద్రను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఎండు గంజాయి పట్టుకున్న ఎస్సై సతీశ్, సిబ్బందికి రివార్డులు అందజేశారు. కాగా, నిందితులు ఒడిశాలోని చిత్రకొండ వద్ద ఎండు గంజాయి కొనుగోలు చేసి కారులో ఏపీలోని విశాఖపట్టణం నుంచి ఖమ్మం మీదుగా మరిపెడ వెళ్లేందుకు కురవి వైపునకు వచ్చి పోలీసులకు పట్టుబడ్డారు.

నేడు సరస్వతి పుష్కరాల యాప్ ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల యాప్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో మంగళవారం(నేడు) ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ యాప్‌లో సరస్వతి పుష్కరాలకు సంబంధించిన సమగ్ర సమాచారం నిక్షిప్తమై ఉండనుంది. కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవస్థానం ఈఓ మహేశ్ హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నారని ఆలయ వర్గాల ద్వారా తెలిసింది.